## చనిపోయాడనుకుంటే..లేచి కూర్చున్నాడు!

- ఐదు గంటలపాటు చెరువులో తేలియాడిన వ్యక్తి
- శవం అంటూ స్థానికుల ఫిర్యాదు
- పోలీసులు బయటకు తీయగా లేచి కూర్చోవడంతో షాక్
- చెరువులో రెస్ట్ తీసుకుంటున్నా..
- నిందితుడి సమాధానంతో అవాక్కు
- హనుమకొండలో వింత ఘటన

చెరువు నీటిలో పడుకున్న వ్యక్తిని బయటకు తీసుకొస్తున్న పోలీసులు

నయీంనగర్, జూన్ 10: హనుమకొండలో చెరువులో వింత ఘటన చోటుచేసుకున్నది. ఓ వ్యక్తి గంటలకొద్దీ నీటిలో తేలాయాడుతూ ఉండటంతో చనిపోయాడు కొని స్థానికులు పోలీసులు, 108కు ఫిర్యాదు చేశారు. వారి వచ్చి బయటకు తీసేందుకు ప్రయత్నిస్తుండగా లేచి నడిచిరావడంతో అంతా అవాక్కయ్యారు. కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధి రెడ్డిపురంలోని కోవెలకుంటలో దాదాపు 46 ఏండ్ల వ్యక్తి సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నీటిలో తేలియాడుతూ ఉండటంతో స్థానికులు అతడు మరణించి ఉంటాడని భావించారు. వెంటనే కేయూసీ పోలీసులకు, 108కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు బయటకు తీసే క్రమంలో అతడు లేచే సరికి అవాక్కయ్యారు. 'ఇక్కడ చల్లగా ఉన్నదని నేను రెస్ట్ తీసుకుంటున్నా.. నేను చావలేదు.. బతికే ఉన్నా' అంటూ సమాధానమిచ్చాడు. తన పేరు శ్రీనివాస్ అని, తన స్వగ్రామం ఏపీలోని నెల్లూరు జిల్లా కావలి అని చెప్పాడు. తాను కాజీపేట దగ్గరలోని ఓ గ్రానైట్ కంపెనీలో పది రోజులుగా వేడి వాతావరణంలో పని చేస్తున్నానని పేర్కొన్నాడు. ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు పని చేస్తుంటానని, అందుకే చెరువులో పడుకొని విశ్రాంతి తీసుకుంటున్నట్టు తెలిపాడు. రూ.50 ఉంటే కాజీపేటకు పోతానంటూ బతిమాలుకున్నాడు.

# ఇసుక తోడివేతపై రైతుల రణం

- బీఆర్‌ఎస్ నేతృత్వంలో ఆందోళన
- వాగులోంచి తీయొద్దని ఫిర్యాదు
- జనగామ కలెక్టర్ ఆదేశాలతో పొక్లెయినర్ వెనక్కి
- ఇసుక తోడితే ఉద్యమమే : బీఆర్‌ఎస్

జనగామ జిల్లా రాంభోజీగూడెం వాగును పరిశీలిస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

దేవరుప్పుల, జూన్ 10 : 'ఎగువన రిజర్వాయర్ల వల్ల కిందికి ఇసుక వస్తలేదు. ఇరవైఏండ్ల కింద 30ఫీట్ల లోతున్న ఇసుక ఇప్పుడు రెంటు మీటర్లకు వచ్చింది. ఇంకా ఈ వాగులో ఇసుక తోడితే మట్టేమిగులుతది. పంటలకు నీళ్లందక ఎవుసం కష్టమైతది' అని రైతులు ఆవేదనతో ప్రభుత్వంపై తిరగబడ్డారు. తమకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్‌ఎస్ నేతృత్వంలో ఆందోళనకు దిగారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం రాంభోజీగూడెం, గొల్లపల్లి వాగుల నుంచి ఇసుక తరలింపు ఆపాలని పరీవాహక ప్రాంతానికి చెందిన వందలాది రైతులు సోమవారం జనగామ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫిర్యాదు చేశారు. వాగులో ఇసుక నిలిచి ఉంటేనే నీళ్లు నిలుస్తాయని, ఇక్కడ ఇసుక నిల్వలు తక్కువ ఉన్నాయని, అయినా అధికారులు ఇసుక తరలింపు కోసం అనుమతులు ఇచ్చారని కలెక్టర్‌కు మహిళా రైతులు వివరించారు. విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అక్కడి నుంచి రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు నేరుగా రాంభోజీగూడెం వాగుకు వెళ్లారు. అప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు వాగు నుంచి పొక్లెయినర్‌ను ఐబీ శాఖ అధికారులు ఒడ్డుకు తీసుకొచ్చారు. వాగులో మీటరున్నర మేరకే ఇసుక ఉండటాన్ని మహిళలు స్వయంగా చూపారు. ఇంకా తోడితే ఇక్కడ మట్టి మాత్రమే మిగిలి నీళ్లు నిల్వ ఉండయని ఆవేదన వ్యక్తం చేశారు.

### తరలిస్తే ఉద్యమమే : బీఆర్‌ఎస్

దేవరుప్పుల మండలంలో వేలాది మంది రైతులు వాగులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, ఇక్కడి నుంచి ఇసుక తోడితే భూగర్భ జలాలు అడుగంటి అన్నదాతలు నీటి కోసం గోసపడుతారని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పారు. వేలాది ట్రక్కుల ఇసుక తరలింపునకు కలెక్టర్ అనుమతినిచ్చారని, ఇందుకు పలు విభాగాల అధికారులిచ్చిన తప్పుడు నివేదికలే కారణమని తెలిపారు. గొల్లపల్లి, రాంభోజీగూడెం వాగుల నుంచి ఇసుక తరలింపును రైతులు పలుమార్లు అడ్డుకున్నా కాంట్రాక్టర్లు మళ్లీ తోడుతున్నారని, అందుకే రైతుల పక్షాన ఉద్యమానికి శ్రీకారం చుట్టామని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి చెప్పారు. స్థానిక అవసరాలకే ఇసుక వాడాలని, భారీ ప్రాజెక్టులకు తరలించొద్దని, ఒకవేళ తరలిస్తే బీఆర్‌ఎస్ తరపున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

### ఇసుక తోడితే బోర్లు ఎత్తిపోతయ్

నాకు వాగు పక్కనే వ్యవసాయ భూమున్నది. ఒడ్డుకు పది బోర్లు వేసినా పడలేదు. వాగులో ఉన్న చేతి బోరే ఎవుసానికి దిక్కైంది. ఇప్పుడు ఇసుక తీస్తే బోరు తేలుతది. మిగతా బోర్లన్నీ ఎత్తిపోతయ్. స్థానిక ఇసుక మాఫియా కుట్ర పన్ని ఈ పని చేస్తున్నది. కలెక్టర్‌ను తప్పుదోవ పట్టిచ్చిండ్రు. కలెక్టర్‌తోని రైతులమంతా మాట్లాడినం. తోడుడు ఆగుతదనే నమ్మకముంది. ఇప్పటికే బోర్లు పోయక, ఎవుసం నడవక ఆటో నడపుకొని బతుకుతున్న. ఇప్పుడు మొత్తానికే నీళ్ల లేకుంటే తిండి గింజలు కూడా కొనుక్కోవాల్సి వస్తది.

- చింత రవి, రైతు, చినమడూరు, దేవరుప్పుల మండలం

కొత్తపేటలో కుళ్లిన గుడ్లను చూపుతున్న చిన్నారి తల్లి స్రవంతి

## అంగన్‌వాడీల్లో కుళ్లిన కోడిగుడ్లు

జనగామ, మానుకోట జిల్లాల్లో ఇద్దరికి అస్వస్థత

నర్మెట/బయ్యారం, జూన్ 10 : అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన కోడిగుడ్లు అందజేస్తుండటంతో చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లాలో చిన్నారి తల్లి, జనగామ జిల్లాలో చిన్నారి అస్వస్థతకు గురయ్యారు. జనగామ జిల్లా నర్మెట మండలం మల్కపేటకు చెందిన బానోత్ అశోక్ కూతురు ఆద్య శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడ ఉడకబెట్టిన కోడిగుడ్డు, కురుకురే తినగా వాంతులు చేసుకున్నది. వెంటనే తల్లిదండ్రులు దవాఖానకు తీసుకెళ్లగా ఫుడ్ పాయిజన్ అయినట్టు వైద్యులు తెలిపారు. అంగన్‌వాడీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా సోమవారం ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ సుమతి కేంద్రాన్ని సందర్శించి కోడి గుడ్లు, కురుకురే ప్యాకెట్లను పరిశీలించారు. కుళ్లిపోయిన కోడిగుడ్లను చూసి మండిపడ్డారు.

### కొత్తపేటలోనూ..

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని కొత్తపేటకు చెందిన పసులేటి సతీశ్, స్రవంతి దంపతులకు 16 నెలల చిన్నారి శ్రావిక ఉన్నది. వారం రోజుల క్రితం స్థానిక అంగన్‌వాడీ సెంటర్-2లో నెల రోజుల కోసం 16 గుడ్లు అందించారు. చిన్నారికి గుడ్డు తినిపించేందుకు సోమవారం ఉడక పెట్టగా తినేందుకు వీలు లేకుండా నల్లగా మారింది. మిగతా గుడ్లను పగులగొట్టి చూడగా కుళ్లిపోయి దుర్వాసన రావడంతో కడుపులో తిప్పి స్రవంతి వాంతులు చేసుకున్నది. నెల రోజుల క్రితం పంపిణీ చేసిన గుడ్లు సైతం బాగా లేకపోవటంతో చిన్నారికి పెట్టకుండానే పారేశామని, నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోలేదని స్రవంతి వాపోయింది. రెండు నెలలుగా గుడ్లు సరిగా రావటం లేదని తెలిపింది.

ఎంవోయూ పత్రాలు చూపుతున్న అగ్నిమాపక సేవల శాఖ డీజీ వై నాగిరెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేశ్ కుమార్

## బ్యాంక్ ఆఫ్ బరోడాతో అగ్నిమాపకశాఖ ఒప్పందం

రూ.1.30 కోట్లకు యాక్సిడెంటల్ డెత్ పాలసీ

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ అగ్నిమాపక శాఖతో వేతనాలు, పెన్షన్లు, ప్రమాదబీమావంటి అంశాలపై అవగాహన ఒప్పందం చేసుకున్నది. రాష్ట్ర పోలీసులకు ఇస్తున్న కవరేజీ, సేవలు, ప్రత్యేక ఆఫర్లను అగ్నిమాపకశాఖ సిబ్బందికి కూడా అందించనున్నారు. ఈ మేరక అగ్నిమాపక సేవల శాఖ డీజీ వై నాగిరెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేశ్ కుమార్ సోమవారం ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో అగ్నిమాపకశాఖ సిబ్బంది ఎవరైనా తమ బ్యాంకు అకౌంట్‌కు వస్తే.. పెన్షనర్లకు ప్రత్యేక ఆఫర్లు, ప్రయోజనాలు లభిస్తాయని తెలిపింది. మెరుగైన ఉచిత సమగ్ర వ్యక్తిగత ప్రమాద బీమా (పీ ఏ ఐ), యోధా రిటైల్ రుణాలపై ప్రత్యేక ఆఫర్లు, డెబిట్, క్రెడిట్ కార్డులు సహా అనేక ఇతర ప్రయోజనాలు అందిస్తామని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.30 కోట్ల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా డెత్ కవరేజీ, ఆఫ్ డ్యూటీలో మరణిస్తే రూ.1.26 కోట్ల వరకు ప్రయోజనాలు, శాశ్వత వైకల్యం కవరేజీ కింద రూ.80 లక్షల వరకు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ జీ వెంకట నారాయణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల వయోపరిమితి 40కి పెంపు

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ) : సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల గరిష్ఠ వయోపరిమితిని 40 ఏండ్లకు పెంచారు. ఈ మేరకు సోమవారం సింగరేణి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు గరిష్ఠ వయోపరిమితి 35 ఏండ్లుగా ఉండగా, కార్మిక సంఘాల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకొన్నది. కార్మికుడు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్‌కు గురైనా, మరణించినా కారుణ్య నియామకాల్లో వారసులకు బదిలీ వర్కర్లుగా ఉద్యోగాలు కల్పిస్తారు.

### జూన్ నెల రాష్ర్టాల పన్నుల వాటా విడుదల

న్యూఢిల్లీ : కేంద్రం పన్నుల్లో రాష్ర్టాలకు జూన్‌లో ఇవ్వవలసిన వాటా విడుదలకు ఆర్థిక శాఖ సోమవారం ఆమోదం తెలిపింది. జూన్‌లో ఇచ్చే వాటాతోపాటు, ఒక అదనపు వాయిదా సొమ్మును కూడా విడుదల చేయబోతున్నది. ఈ రెండూ కలిపి రూ.1.39 లక్షల కోట్లు అని తెలిపింది. ఏప్రిల్ నుంచి జూన్ 10 వరకు రాష్ర్టాలకు చెల్లించిన మొత్తం సొమ్ము రూ.2,79,500 కోట్లు అని వివరించింది.

# కొత్త మద్యం బ్రాండ్లకు తాత్కాలిక బ్రేక్!

మొదటిపేజీ తరువాయి...

విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం అనధికారికంగా కొత్త మద్యం విధానాన్ని ప్రవేశపెట్టేందుకు చేసిన ప్రయత్నాలపై ఇటీవల 'నమస్తే తెలంగాణ' వరుసగా కథనాలు రాసింది. కొత్త బీర్ బ్రాండ్లపై నెటిజన్లు సైతం సోషల్ మీడియాలో వ్యతిరేకత వ్యక్తం చేశారు. కొత్త కొత్త మీమ్స్‌తో తమ నిరసనను వ్యక్తంచేశారు. దీంతో కొత్త మద్యం బ్రాండ్లపై రాష్ట్రవ్యాప్తంగా చర్చకు తెరలేచింది. మొత్తంగా కొత్త మద్యం బ్రాండ్ల వ్యవహారం తలనొప్పిగా మారడంతో కొత్త కంపెనీలకు ఇవ్వాల్సిన అనుమతులను తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలిసింది.

### కంపెనీల ప్రతినిధులతో చర్చలు..

తెలంగాణలో కొత్తగా బీర్లు సప్లయ్ చేసేందుకు ఐదు కొత్త కంపెనీలకు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ అనుమతులు ఇచ్చింది. ఈ ఐదు కంపెనీలు సుమారు 27 రకాల బీర్లను తెలంగాణలో ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేశాయి. అనుమతులు పొందిన కొన్ని కంపెనీల నేపథ్యం సరిగా లేకపోవడం, కొన్నిచోట్ల కల్తీ మద్యాన్ని విక్రయించారని వార్తలు రావడంతో ప్రజలు, మద్యం ప్రియుల నుంచి తీవ్ర

వ్యతిరేకత వచ్చింది. 'నమస్తే తెలంగాణ' రాసిన కథనాల ఆధారంగా మీడియా కూడా ఈ వ్యవహారంపై దృష్టిపెట్టడంతో ప్రభుత్వం ఆలోచనలో పడ్డట్టు తెలిసింది. దీంతో ఆయా కంపెనీల ప్రతినిధులతో చర్చించి.. వారికి ఇచ్చిన అనుమతులను ప్రస్తుతానికి నిలిపివేసినట్టు సమాచారం.

### ఏపీలో లోడ్లు.. టీజీలో నోస్టాక్ బోర్డులు!

ఏపీలో నూతన మద్యం పాలసీని రచించే క్రమంలో కింగ్‌ఫిషర్ బీర్లను లోడ్లకు లోడ్లు దించుతుంటే.. తెలంగాణలో మాత్రం ఇంకా కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయని మద్యం ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ రేషన్ పద్ధతిలోనే కొన్ని ప్రముఖ బ్రాండ్లకు చెందిన బీర్లను సప్లయ్ చేస్తున్నట్టు మద్యం షాపుల నిర్వాహకులు చెప్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టే సప్లయ్‌ని పెంచామని, అన్నిమద్యం షాపుల్లో బీర్ల నిల్వలు ఉన్నాయని ఎక్సైజ్‌శాఖ చెప్తున్నది. మొత్తానికి తెలంగాణలో కృత్రిమంగా బీర్ల కొరత సృష్టించారని అర్థమైంది. ఈ కృత్రిమ కొరత నేపథ్యంలో కొందరు వ్యాపారులు సిండికేట్ అయినట్టు సమాచారం. ఉన్న కొరతను, రేషన్ పద్ధతిలో వస్తున్న సప్లయ్‌ని క్యాష్ చేసుకునేందుకు బెల్ట్‌షాపుల నిర్వాహకులతో కుమ్మక్కు అయినట్టు మద్యం ప్రియులు వాపోతున్నారు. అధిక ధరలకు బీర్లను విక్రయిస్తున్నారని, ఎక్సైజ్‌శాఖ దీనిపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## వాణిజ్య

### యమహా నయా స్కూటర్

చెన్నై, జూన్ 10: దేశీయ మార్కెట్లోకి మరో స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది యమహా మోటర్. యూరోపియన్ డిజైన్, పనితీరు, నయా లుక్‌తో తీర్చిదిద్దిన ఈ ఫ్యాసినో ఎస్ మాడల్ యువతను దృష్టిలో పెట్టుకొని తయారు చేసింది. రెండు రకాల్లో లభించనున్న ఈ స్కూటర్ ధర రూ.93,730, రూ.94,530గా నిర్ణ‌ధంచింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. బీఎస్-6 ప్రమాణాలకు లోబడి ఈ స్కూటర్‌ను తయారు చేసినట్లు, ముఖ్యంగా 125 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్ స్మార్ట్ మోటర్ జనరేటర్(ఎస్‌ఎంజీ), సైలెంట్ స్టార్ట్, ఎయిర్-కూల్డ్, పనితీరు అధికంగా ఉంటుందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

### ఆ వీడియోలతో జాగ్రత్త



న్యూఢిల్లీ, జూన్ 10: డీప్‌ఫేక్ వీడియోలతో జాగ్రత్తగా ఉండాలని మదుపరులను ఎన్‌ఎస్‌ఈ హెచ్చరించింది. ఈ క్రమంలోనే తమ ఎండీ, సీఈవో ఆశిశ్‌కుమార్ చౌహాన్ పెట్టుబడి సలహాలను ఇస్తున్నట్టు వస్తున్న ఆడియో, వీడియో క్లిప్‌లను నమ్మవద్దని.. అవన్నీ మోసపూరితమైనవేనని ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఎన్‌ఎస్‌ఈ చీఫ్ చౌహాన్ గొంతు/ముఖంతో తప్పుడు ప్రచారం జరుగుతున్నదని, వాటిలో ఎన్‌ఎస్‌ఈ లోగో కూడా ఉంటున్నదని గుర్తించినట్టు చెప్పింది. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి మోసగాళ్లు ఈ ఎత్తుగడలకు దిగారని, వాటిని నమ్మి మోసపోవద్దని ఇన్వెస్టర్లను ఎన్‌ఎస్‌ఈ కోరింది. అలాంటి తప్పుడు వీడియోలు ప్రసారం కాకుండా చూడాలని వివిధ సామాజిక మాధ్యమాలకూ విజ్ఞప్తి చేసింది. మదుపరులకు తాము ఏదైనా సమాచారం ఇవ్వాలనుకుంటే తమ అధికారిక వెబ్‌సైట్లలో మాత్రమే ఇస్తామని కూడా స్పష్టం చేసింది.

# సంస్కరణల అమలు కష్టమే

ఈసారి అంత ఈజీ కాదు • కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వంపై యూబీఎస్ అంచనా




ముంబై, జూన్ 10: వరుసగా మూడోసారి కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరినా.. ఈ ఐదేండ్లు మాత్రం అంత ఈజీ కాదని స్విస్ బ్రోకరేజీ దిగ్గజం యూబీఎస్ అంటున్నది. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే మెజారిటీ రాకపోవడంతో మిత్రపక్షాల మద్దతుతో అధికారాన్ని చేపట్టిన ప్రధాన మంత్రి మోదీకి.. కీలక సంస్కరణలపై నిర్ణయం సవాలేనని సోమవారం వ్యాఖ్యానించింది. 2014, 2019లో దూకుడు ప్రదర్శించిన బీజేపీ.. ఈసారి సంకీర్ణ ప్రభుత్వంలో భాగం కావాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే భూములు, వ్యవసాయం, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, యూనిఫామ్ సివిల్ కోడ్, ఒకే దేశం-ఒకే ఎన్నికలు వంటి ప్రధాన సంస్కరణల్ని అమల్లోకి తేవాలంటే ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షాల అంగీకారం తప్పనిసరిగా ఉండాలని యూబీఎస్ గుర్తుచేస్తున్నది. ఒకవేళ ఈ సంస్కరణలు అమలైతే తయారీ తదితర కీలక రంగాలు పరుగులు పెట్టి దేశ ఆర్థిక వృద్ధిరేటు వచ్చే ఐదేండ్లలో 7.5 శాతానికి పైనే ఉండొచ్చని యూబీఎస్ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త తన్వీ గుప్తా జైన్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

### ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గవ్!

ఈ ఏడాది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్లను తగ్గించకపోవచ్చని యూబీఎస్ చీఫ్ ఎకనామిస్ట్ జైన్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అయితే వచ్చే ఏడాది రెపో రేటు అర శాతం (0.50 శాతం) తగ్గేందుకు వీలున్నదని చెప్పారు. కాగా, ఇప్పటికే దేశంలో సంస్కరణల అమలు అంశంపై అటు ఫిచ్ రేటింగ్స్, ఇటు మూడీస్ స్పందించిన విషయం తెలిసిందే. 'ఈసారి బీజేపీకి తగ్గిన మెజారిటీ.. పాలనాపరమైన సవాళ్లకు, ముఖ్యంగా ఆర్థిక సంస్కరణల అమలుకు బ్రేక్ వేస్తుందనిపిస్తున్నది' అని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. అలాగే 'పార్లమెంట్‌లో ఈసారి బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ లేదు. దీనివల్ల ఆర్థిక సంస్కరణల అమలు ఆలస్యం కావచ్చు. ఇది ఆర్థిక క్రమశిక్షణనూ దెబ్బతీసేలా ఉన్నది' అని మూడీస్ అభిప్రాయపడింది.

# మారుతి సుజుకీ దూకుడు

టాప్-10 విక్రయాల్లో కంపెనీవి ఏడు మాడళ్లు

**మే నెలలో అత్యధికంగా అమ్ముడైన కార్లు**

| మాడల్ | 2024 | 2023 | వృద్ధి(%లో) |
|---|---|---|---|
| మారుతి స్విఫ్ట్ | 19,393 | 17,346 | 12 |
| టాటా పంచ్ | 18,949 | 11,124 | 70 |
| మారుతి డిజైర్ | 16,061 | 11,315 | 42 |
| హ్యుందాయ్ క్రెటా | 14,662 | 14,449 | 1 |
| మారుతి వ్యాగన్ ఆర్ | 14,492 | 16,258 | -11 |
| మారుతి బ్రెజ్జా | 14,186 | 13,398 | 6 |
| మారుతి ఎర్టిగా | 13,893 | 10,528 | 32 |
| మహీంద్రా స్కార్పియో | 13,717 | 9,318 | 47 |
| మారుతి బాలెనో | 12,842 | 18,733 | -31 |
| మారుతి ఫ్రాంక్స్ | 12,681 | 9,863 | 29 |

న్యూఢిల్లీ, జూన్ 10: కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ దూసుకుపోతున్నది. గత నెలలో దేశవ్యాప్తంగా అమ్ముడైన టాప్-10 వాహనాల్లో కంపెనీకి చెందిన ఏడు మాడళ్లకు చోటు లభించింది. ఈ జాబితాలో మారుతికి చెందిన స్విఫ్ట్ తిరిగి తొలి స్థానంలో నిలిచింది. 19,393 యూనిట్లతో స్విఫ్ట్ తొలిస్థానం దక్కించుకున్నది. ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన సరికొత్త స్విఫ్ట్‌లో పలు మార్పులు చేయడంతో కొనుగోలుదారులు మక్కువచూపిస్తున్నారు.

### ప్యాసింజర్ వాహనాలకు బ్రేక్

గత కొన్ని నెలలుగా పెరుగుతూ వచ్చిన ప్యాసింజర్ వాహన విక్రయాలకు బ్రేక్ పడింది. వేసవి కాలం కావడంతో సార్వత్రిక ఎన్నికలు జరగడంతో వాహనాలకు డిమాండ్ పూర్తిగా పడిపోయింది. దీంతో గత నెలలో పీవీల అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన ఒక్క శాతం తగ్గాయని గత నెలకుగాను దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. మొత్తంగా 3,03,358 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు రిజిస్ట్రేషన్ జరిగాయి. ఏడాది క్రితం ఇదే నెలలో అయిన 3,35,123 యూనిట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి.

# రికార్డుల నుంచి వెనక్కి

76,490 పాయింట్లకి పడిపోయిన సెన్సెక్స్

- ఐటీ రంగ సంస్థలైన టెక్‌మహీంద్రా, ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు 3 శాతం వరకు నష్టపోయాయి. అలాగే మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, ఐటీసీ, హెచ్‌యూఎల్, కొటక్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.
- కానీ, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, టాటా మోటర్స్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నాలుగు శాతం వరకు బలపడ్డాయి.
- రంగాలవారీగా చూస్తే సేవలు 1.61 శాతం, రియల్టీ 1.34 శాతం, కమోడిటీస్ 1.28 శాతం, యుటిలిటీ 1.11 శాతం, హెల్త్‌కేర్, ఇండస్ట్రీయల్స్ షేర్లు నష్టపోయాయి.

ముంబై, జూన్ 10: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న సూచీలు చివరి గంటలో అమ్మకాలు పోటెత్తడంతో తిరిగి నష్టాల్లోకి జారుకున్నది. ఎన్నికల ర్యాలీ కారణంగా గత ఐదు రోజులుగా భారీగా పెరిగిన సూచీ సోమవారం కూడా ఒక దశలో 77 వేల పాయింట్లను అధిగమించింది. మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో దేశీయ ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 203.28 పాయింట్లు కోల్పోయి 76,490.08 వద్ద ముగిసింది. ఒక దశలో 385 పాయింట్లు ఎగబాకి ఆల్‌టైం హైకి 77,079.04 వద్దకు చేరుకున్నది. అటు మరో సూచీ నిఫ్టీ సైతం 30.95 పాయింట్లు కోల్పోయి 23,259.20 వద్ద స్థిరపడింది.

## డెరివేటివ్ సెగ్మెంట్ కఠినం

- నిబంధనల్ని సవరించిన సెబీ

డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో ఇండివీడ్యువల్ స్టాక్స్ ప్రవేశం కోసం క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ సోమవారం పలు కఠిన నిబంధనల్ని ప్రతిపాదించింది. వీటి ప్రకారం స్టాక్ మార్కెట్లలో ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్ (ఎఫ్అండ్‌వో) సెగ్మెంట్ నుంచి స్థిరంగా తక్కువ టర్నోవర్‌తోనే ట్రేడ్ అవుతున్న స్టాక్స్ దూరం కానున్నాయి. దీంతో పరిమాణం, విలువ, మార్కెట్ లావాదేవీల ఆధారంగా భారీ స్టాక్స్ మాత్రమే డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో ఉండాలన్నది సెబీ ఉద్దేశంగా తెలుస్తున్నది. ఇదిలావుంటే నామినీని పేర్కొనని మ్యూచువల్ ఫండ్ ఫోలియోలను, డీమ్యాట్ ఖాతాలను స్తంభింపజేయాలన్న నిబంధనను మదుపరుల కోసం సెబీ తొలగించింది. అలాగే భౌతిక రూపంలో సెక్యూరిటీలను కలిగి ఉన్న ఇన్వెస్టర్లు.. డివిడెండ్, వడ్డీ లేదా రిడెంప్షన్ చెల్లింపులకు అర్హులేనన్నది. ఇక వచ్చే నెలలో 7 సంస్థలకు చెందిన 22 ఆస్తులను సెబీ వేలం వేయనున్నది. మదుపరుల నుంచి అక్రమంగా వసూలు చేసిన నగదును రికవరీ చేయడంలో భాగంగా జూలై 8న పైలాన్ గ్రూప్, విబ్‌గ్యార్ గ్రూప్, జీబీసీ ఇండస్ట్రియల్ కార్ప్ గ్రూప్, టవర్ ఇన్ఫోటెక్ గ్రూప్, వారిస్ గ్రూప్, టీచర్స్ వెల్ఫేర్ క్రెడిట్ అండ్ హోల్డింగ్ గ్రూప్, అనెక్స్ ఇన్‌ఫ్రాసంస్థల ఆస్తులను విక్రయానికి పెట్టనున్నారు.

### ఎఫ్‌డీలపై వడ్డీ పెంచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

న్యూఢిల్లీ, జూన్ 10: డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ఒక్కో బ్యాంక్ తమ డిపాజిట్లపై వడ్డీరేట్లను పెంచుతున్నాయి. ఇప్పటికే బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ వడ్డీరేట్లను పెంచగా..తాజాగా ఈ జాబితాలోకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చేరింది. సోమవారం నుంచి అమలులోకి వచ్చేలా ఎఫ్‌డీలపై వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు సవరించింది. రూ.2 కోట్ల లోపు డిపాజిట్లకు మాత్రమే ఈ పెంపు వర్తించనున్నదని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఏడు రోజుల నుంచి 10 ఏండ్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటు 3 శాతం నుంచి 7.25 శాతం మధ్యలో ఉన్నది. దీంట్లో అత్యధికంగా 18 నెలల నుంచి 21 నెలల లోపు డిపాజిట్లపై వడ్డీరేటు 7.25 శాతం చొప్పున ఆఫర్ చేస్తున్నది. సీనియర్ సిటిజన్లకు అర శాతం వడ్డీని అధికంగా చెల్లిస్తున్నది.

### రూపాయి 10 పైసలు డౌన్

ముంబై, జూన్ 10: రూపాయి మళ్లీ బీటలుపడుతున్నాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. దీంట్లోభాగంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 10 పైసలు కోల్పోయి 83.50 వద్దకు జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్లో 83.48 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు చివరకు 83.50కి పడిపోయింది. గత వారం 13 పైసలు పెరిగింది.

# ఈక్విటీ ఎంఎఫ్‌లు భళా

- మేలో 34,697 కోట్ల పెట్టుబడులు
- ఏప్రిల్‌తో పోల్చితే దాదాపు రెట్టింపు
- సిప్‌లలో గరిష్ఠానికి ఇన్వెస్ట్‌మెంట్లు
- వరుసగా రెండో నెలా 20వేల కోట్లపైనే

న్యూఢిల్లీ, జూన్ 10: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ల్లోకి పెట్టుబడులు పోటెత్తాయి. గత నెల మేలో రికార్డు స్థాయిలో రూ.34,697 కోట్లు వచ్చాయి. అంతకు ముందు నెల ఏప్రిల్‌లో రూ.18,917 కోట్లుగానే ఉన్నాయి. కాగా, స్టాక్ మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులున్నా.. ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి భారీగా పెట్టుబడులు వస్తుండటం గమనార్హం. ఈ క్రమంలోనే ఈక్విటీ ఫండ్స్‌ల్లోకి పెట్టుబడులు రావడం వరుసగా ఇది 39వ నెల అని భారతీయ ఎంఎఫ్‌ల సంఘం (యాంఫీ) తెలిపింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్ ఆఖరు నాటికి మొత్తం మ్యూచువల్ ఫండ్ సంస్థల ఆధ్వర్యంలో ఉన్న ఆస్తులు రూ.57.26 లక్షల కోట్లుగా ఉంటే.. మే నెలలో రూ.58.91 లక్షల కోట్లకు చేరాయి.

### సిప్‌లు ఆకర్షణీయం

సిప్‌లలో పెట్టుబడులు మదుపరులను ఆకట్టుకుంటున్నాయి. మే నెలలో రూ.20,904 కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్‌లో రూ.20,371 కోట్లుగా ఉండగా.. వరుసగా రెండో నెలా రూ.20వేల మార్కును దాటినట్టైంది. 'ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌ల్లో నికర పెట్టుబడులు మే నెలలో రూ.25.39 లక్షల కోట్లకు చేరాయి' అని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని తెలిపారు. ఇదిలావుంటే డెట్ కేటగిరీ స్కీముల్లో మే నెల నికర పెట్టుబడులు రూ.42,495 కోట్లుగా ఉన్నాయి. అయితే ఏప్రిల్‌తో పోల్చితే దాదాపు 78 శాతం పడిపోయాయి.